




దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :129 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 05-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-


## రామభక్తుల మద్దతు, ఆశీస్సులు ముఖ్యం: జితేంద్ర మిశ్రా

అయోధ్య: అయోధ్య రామాలయం సీఈవోగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులైన విషయం తెలిసిందే. అయితే రామభక్తుల మద్దతు, దీవెనలు తమకు ముఖ్యమని ఆయన అన్నారు. రామ ట్రస్టు వ్యూహాలు త్వరలో ఆచరణలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. ట్రస్టు సభ్యులతో మీటింగ్ నిర్వహించిన తర్వాత ఇవాళ జితేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడారు. భక్తుల విశ్వాసం, దీవెనలు తమ పట్ల ఉండాలని ఆశిస్తున్నట్లు మిశ్రా తెలిపారు. రామభక్తుల ఆశీస్సులు తమకు ముఖ్యమన్నారు. మీ దీనవలు, నమ్మకంతోనే మేం ముందుకు వెళ్తామని, నాకు కొంత సమయం ఇవ్వండి అంటూ మిశ్రా అన్నారు.శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు బుధవారం మిశ్రాను తొలి సీఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య రామాలయ వ్యవహార శైలిని సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల్లో తమ వ్యూహాలు అమలులోకి రానున్నట్లు ఆయన చెప్పారు. వివిధ బృందాల సహాకారంతో ఆయోధ్య ఆలయంలో చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కీలకమైన నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తామన్నారు.



తనకు సీఈవో బాధ్యతలు అప్పగించిన శ్రీరాముడికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు.ట్రస్టు జనరల్ సెక్రటరీ గోవింద దేవ్ గిరి సమక్షంలో వైదేహి భవన్‌లో మీటింగ్ నిర్వహించారు. ట్రస్టు మార్గదర్శకాలతోనే భవిష్యత్తు వ్యూహాలను రచించనున్నట్లు చెప్పారు. రామాలయ సెక్రటరీగా గిరి, ట్రెజరర్‌గా మహేశ్ భాగ్‌చంద్కా నియమితులయ్యారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో వెస్టన్ ఎయిర్ కమాండ్‌కు జీతేంద్ర మిశ్రా హెడ్‌గా ఉన్న విషయం తెలిసిందే.

## హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు గురుపూజోత్సవం తరలింపు

రాష్ట్రస్థాయి టీచర్స్ డే వేడుకల వేదిక అనూహ్యంగా మారిపోయింది. హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి గురుపూజోత్సవాన్ని రేవంత్ సర్కార్ కొడంగల్‌కు తరలించింది. తొలుత హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని ఆధునికీకరించిన బాలభవన్‌లో వేడుకలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం సుమారు రూ.70 లక్షల వ్యయంతో బాలభవన్ ఆధునికీకరణ పనులను సైతం పూర్తి చేసింది. అయితే కార్యక్రమానికి కొద్దిరోజుల ముందు వేదికను అనూహ్యంగా కొడంగల్‌కు మార్చడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్ వెలుపల తొలిసారి

రాష్ట్రస్థాయి టీచర్స్ డే వేడుకలను హైదరాబాద్‌కు వెలుపల నిర్వహించడం ఇదే తొలిసారిగా భావిస్తున్నారు. ఈసారి కొడంగల్‌లో రాష్ట్రస్థాయి గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు పురస్కారాలు అందజేయనున్నారు. అయితే అవార్డులకు ఎంపికైన వారంతా నేరుగా కొడంగల్‌లోని కార్యక్రమ వేదిక వద్దకు రావాలని అధికారులు ఆదేశించారు.

చివరి నిమిషంలో వేదిక మార్పు

తొలుత హైదరాబాద్‌లోనే రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతుందని అధికారులు, ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీతలు భావించారు. దీనికి అనుగుణంగానే పలువురు తమ ప్రయాణ, ఇతర ఏర్పాట్లను చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే చివరి నిమిషంలో వేదికను కొడంగల్‌కు మార్చడంతో అవార్డులకు ఎంపికైన వారిలో అయోమయం నెలకొంది.హైదరాబాద్‌లోనే కార్యక్రమం ఉంటుందని భావించిన వారికి అకస్మాత్తుగా కొడంగల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన అవార్డు గ్రహీతలు కొడంగల్ చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.రాష్ట్రస్థాయి వేడుకల వేదిక మార్పుపై చివరి వరకు స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీతల్లో ఉత్కంఠ నెలకొంది. కొడంగల్‌లో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు కార్యక్రమానికి ఒక్కరోజు ముందు అక్కడికి చేరుకుని ఏర్పాట్లను హడావుడిగా చేపట్టినట్లు సమాచారం. చివరి నిమిషంలో మారిన వేదిక కారణంగా ఏర్పాట్లపై కూడా ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది.

## జంగారెడ్డిగూడెంలో మత్తు ఇంజెక్షన్ల దందా..

ఏలూరు: ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంలో కొత్తరకం దందాకు తెరలేపారు. మత్తు ఇంజక్షన్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మత్తుకు బానిలైన వారికి, యువతకు వీటిని విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఈగల్ టీమ్ జంగారెడ్డిగూడెంలో తనిఖీలు చేపట్టాయి. దీంతో ఓ కార్పెంటరీ దుకాణంలో దాచిన ట్రెమడాల్ మత్తు ఇంజెక్షన్లు వెలుగు చూశాయి. సుమారు ఏడువేల మత్తు ఇంజెక్షన్ల వయల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అబిద్ అలీ, మల్లికార్జున వెల్లడించారు.ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని లక్ష్మీశ్రీనివాస్ అనే మెడికల్ ఏజెన్సీ మెడికల్ ఏజెన్సీలో ఈగల్ టీమ్ డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు కిశోర్‌ను ప్రశ్నించగా తన వద్ద ఆ ఇంజెక్షన్లు లేవని, వాటిని డంపింగ్ యార్డులో ధ్వంసం చేశానని చెప్పాడు. అతడు చెప్పినతీరుపై అనుమానం వచ్చిన అధికారులు అతడిని అదుపులోకి వారి స్టైల్‌లో విచారించగా మత్తు ఇంజెక్షన్ల



దందా గుట్టు రట్టు అయ్యింది.కిశోర్ తన స్నేహితుడు కుమార్ నడుపుతున్న కార్పెంటరీ దుకాణంలో ట్రెమడాల్ ఇంజెక్షన్లు దాచి ఉంచినట్లు అధికారులకు వెల్లడించాడు. దీంతో ఆ దుకాణంలో నాలుగు బాక్సుల్లో దాచి ఉంచిన ఏడువేలకు పైగా వయల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా భవానీ మెడికల్స్ షాపునకు మూడు వేల ఇంజెక్షన్లు అమ్మినట్లు కిశోర్ అధికారులకు వెల్లడించాడు.

## రేవంత్ సర్కార్‌లో మహిళలకు తీరని అన్యాయం

ఇల్లెందు, సెప్టెంబర్ 04 : తెలంగాణలో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలకు తీరని అన్యాయం చేస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శుక్రవారం ఇల్లెందు పట్టణం జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం ముందు ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన మాట మరిచి 6 గ్యారంటీలు 420 మోసాలపై ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొని రోడ్డుపై వంటావార్పు కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేంద్రతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ.. ఈరోజు రాష్ట్రంలో ఒక బీసీ మహిళను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేసి అవమాన పరిచిన తీరును చూస్తే రేవంత్ సర్కార్ తీరు అర్థమవుతుందన్నారు.

కాంగ్రెస్ అబద్ధపు పునాదుల మీద ప్రభుత్వం ఏర్పాటు చేసి రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తుందన్నారు. గత సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలను ఒక్కొక్కటిగా తెలంగాణ ప్రజలకు దూరం చేస్తున్నట్లు మండిపడ్డారు. మహిళలకు ఇస్తానన్న హామీలు అమలు చేయకుండా అన్ని రంగాలలో మహిళలకు అన్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వంట వార్పు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలు పట్టవు కానీ మాట్లాడితే ఢిల్లీకి మాత్రం వెళ్తారు. ప్రజా సమస్యలను సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి ఢిల్లీ చుట్టూ ప్రదర్శన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ హరి సింగ్ నాయక్, పట్టణ నాయకులు సుదర్శన్ రంగనాథ్, అబ్దుల్ జబ్బర్, సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవిలాల్, బర్మావత్ లాల్ సింగ్, శీలం రమేష్, జెకె శ్రీను, దాస్యం ప్రమోద్, తోట లలిత శారద, నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత, భవాని, గిన్నారపు రాజేష్, ఎంటెక్ మహేందర్, ఉపేందర్, రామ్ లాల్ పాసి, దేరంగుల పోశం, చాంద్ పాషా, భాష, బండారి శ్రీనివాస్, యేపే శంకర్, రాజ్ కోటి, రవికాంత్, గడ్డి శీను, నీలం రాజశేఖర్, కాసాని హరిప్రసాద్, సత్తల హరికృష్ణ, ఇమ్రాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం.

హైదరాబాద్ :కృష్ణాబోర్డు పరిధిలో నీటి పంపకాల విషయంలో శుక్రవారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఈఎన్సీల సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ పూర్తి స్థాయి నిర్వహించి నీటి వాటాల విషయంలో నిర్ణయం తీసుకోనుంది.

50 శాతం వాటా అడిగాం : తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు

ఈ సందర్భంగా తెలంగాణ తరుపున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చేరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్‌ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు.ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు





వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు.సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు.

## అర్నాల్డ్ డిక్స్ గైడెన్స్‌లో టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్

కాట్మాండు: నేపాల్‌లో త్రిశూలీ 3ఏ హైడ్రోపవర్ టన్నెల్ నుంచి ఇవాళ ఇద్దర్ని సురక్షితంగా బయటకు తీసిన విషయం తెలిసిందే. అయితే ఆగస్టు 26వ తేదీన వచ్చిన వరదలు.. బోటెకోసి నది మార్గంలో ఉన్న అన్ని హైడ్రోపవర్ కేంద్రాలను పూడ్చివేశాయి. సుమారు 12 పవర్ ప్లాంట్లు భూగర్భంలో కలిసిపోయాయి. నేపాల్ ప్రభుత్వం ప్రకారం సుమారు 900 మంది కార్మికులు వివిధ టన్నెల్స్‌లో చిక్కుకున్నట్లు తెలిసింది. అయితే ఇంటర్నేషనల్ టన్నెల్లింగ్ అండ్ అండర్‌గ్రౌండ్ స్పేస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అర్నాల్డ్ డిక్స్ సూచనల ప్రకారం ప్రస్తుతం నేపాల్ టన్నెల్స్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

ఎలా రెస్క్యూ నిర్వహించాలన్న అంశాలను అర్నాల్డ్ డిక్స్ నేపాల్ సర్కారుకు వివరిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టలేదని, ఎందుకంటే టన్నెల్ ఎంట్రన్స్ ఎక్కడ ఉందో తెలియకుండాపోయిందని ఆయన అన్నారు. ఒకప్పుడు పైన ఉన్న టన్నెల్ ఎంట్రెన్స్, ఇప్పుడు భూగర్భంలోకి మారిందన్నాడు. దీన్ని బట్టి ఆ కొండచరియలు ఎంత భీకరంగా ఉండి ఉంటాయో అర్థం చేసుకోవచ్చు అని ఆయన అన్నారు. ఆ భయంకర వరద



ధాటికి ఎంట్రెన్స్ మొత్తం కూలిందన్నారు. అయితే శాటిలైట్ డేటా ఆధారంగా రెస్క్యూ చేపట్టాల్సిన ప్రాంతాన్ని గుర్తించారు. చాలా ప్రయత్నాలు చేసిన తర్వాత ఎంట్రెన్స్ ప్రాంతాన్ని పసికట్టినట్లు చెప్పారు. ఇక ఆ టన్నెల్‌లో ప్రాణాలతో ఉన్నవారిని.. ఎక్కడున్నారో గుర్తించడం మరో కీలక అంశంగా మారిందన్నారు. ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియదు కాబట్టి, టెక్నాలజీతో అంచనా వేస్తున్నట్లు డిక్స్ తెలిపారు. బురద, బండ రాళ్లతో నిండిపోయిన టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. కొన్ని చోట్ల కార్ల కన్నా పెద్ద సైజులో బండరాళ్లు ఉన్నాయన్నారు.భారీ రాళ్లను డైనమేట్లతో పేల్చుతున్నారు. వాస్తవానికి పేల్చడం పద్ధతి కాదు, కాని ఇక్కడున్న శిథిలాల తొలగింపు మరోలా సాధ్యం కాదన్నారు.

## ఉద్యోగులకు అవుట్ పేషెంట్ సేవలు ఉచితంగా అందించాలి

హైదరాబాద్ : ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద నిమ్స్‌లో అవుట్ పేషెంట్ సేవలు ఉచితంగా అందించాలని నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం ఈహెచ్ఎస్ పేషెంట్లకు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఐపీ సేవలు, వెల్‌నెస్ సెంటర్లలో మాత్రమే ఓపీ సేవలు అందించాల్సి ఉండగా, నిమ్స్‌లో కూడా అవుట్‌పేషెంట్ సేవలు యథావిధిగా ఉచితంగానే కొనసాగించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా, మరో 24 సెంటర్లను కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకూ వెల్‌నెస్ సెంటర్లు లేని, అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది.




హైదరాబాద్‌లోనూ మరో 3 వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. జనరల్ హాస్పిటళ్లకు అనుసంధానించి వెల్‌నెస్ సెంటర్లలోనూ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్నది.

## మంత్రి పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్ రెడ్డి నిషేధించాలి : హరీశ రావు

పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్ రెడ్డి నిషేధించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై కుమ్రంభీం జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్‌లో బీఆర్ఎస్ పోరుబాట ( దీ=ర్యాతీశేవర్ ) నిర్వహించింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..కొండా సురేఖ నిన్ను తిట్టిందని మంత్రి వర్గం నుంచి తీసేశావు. మరి లక్షల మంది ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద నువ్వు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. నీకు ఏమైనా పొంగులేటి చేసే పనుల్లో 50/50 వాటా ఉందా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. బ్యాంక్ క్రాప్ లోన్ కోసం పోతే మా భూమి నిషేధిత జాబితాలో పెట్టారని చెబుతున్నారు. గతంలో క్రాప్ లోన్ వచ్చింది ఇప్పుడు ఎందుకు రావడం లేదని అడిగితే 22ఏ కింద మీ భూమి ఉందని బ్యాంకులో చెబుతున్నారని



హరీశ్ రావు ముందు ఓ మహిళన ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు.

## 'సీతారామ కెనాల్ ద్వారా చెరువులు నింపాలి'

బూర్గంపహాడ్, సెప్టెంబరు 04 : సీతారామ ప్రాజెక్టు కెనాల్ నుండి కృష్ణసాగర్ చెరువుకు సాగునీటిని నింపాలని రాష్ట్ర రెవెన్యూ, ఆర్థిక, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముసలిమడుగు, కృష్ణసాగర్ పంచాయతీల ప్రజాప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. లక్ష్మీపురంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయనకు కృష్ణసాగర్ ఉప సర్పంచ్ భూక్యా మోహన్‌రావు, ముసలిమడుగు సర్పంచ్ పూనెం సురేంద్ర రెండు పంచాయతీల రైతుల తరఫున సీతారామ కెనాల్ నుంచి చెరువుకు నీటిని నింపి రెండు పంటలు పండించుకునే అవకాశం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు నీటి సరఫరా విషయమై మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. తొలుత మంత్రి మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుమారుడి వివాహానికి ఇటీవల రాలేకపోవడంతో ఆయన నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. వినతిపత్రం అందించిన



వారిలో వార్డు సభ్యులు ఇర్పా శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## తీవ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం

జమ్మూ కాశ్మీర్‌లో శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగింది. బుద్గాం జిల్లాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఈ విషయాన్ని ఇండియన్ ఆర్మీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దీని ప్రకారం.. ఆపరేషన్ అఫ్దర్ పేరుతో జమ్మూ కాశ్మీర్‌లో తాజా ఆపరేషన్ ప్రారంభమైంది.

జమ్మూ కాశ్మీర్‌లోని, బుద్గాం జిల్లా, అఫ్దర్ గాలి ప్రాంతంలో ఉగ్రవాదులున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. దీంతో అనుమానాస్పద ప్రాంతాల్లో ఇండియన్ ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు కలిసి సంయుక్తంగా శుక్రవారం సోదాలు ప్రారంభించారు. ఆపరేషన్ అఫ్దర్ పేరుతో తనిఖీ, భద్రతా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు.

దీంతో భారత భద్రతా బలగాలు కూడా వారిపై ఎదురు కాల్పులకు దిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. అతడి వద్ద నుంచి ఏకే రైఫిల్, కొన్ని ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఉగ్రవాదుల కోసం ఇంకా గాలింపు కొనసాగుతోందని సైన్యం వివరించింది. ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.




## సంపాదకీయం

శనివారం 05-09-2026

# చైనా ఉత్పత్తులే శరణ్యమా?

చైనీస్ ఉత్పత్తులను బహిష్కరించాలనే పిలుపులు భారత్‌తో పాటు ఐరోపా, అమెరికా, వియత్నాం, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లోనూ ఊపందుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తి... ప్రజల్లో ఆందోళన, అభద్రతా భావనలు రేగినప్పుడల్లా బీజింగ్ ఉత్పత్తులను బహిష్కరించాలనే వాదనలు తీవ్రమవుతుంటాయి. అయినాసరే, ఈ ఉద్యమాలేవీ ఆశించిన ఆర్థిక లక్ష్యాలను సాధించడం లేదు. అందుకు కారణం- సరసమైన ధరలకు లభించే చైనా ఉత్పత్తులు ప్రపంచ సరఫరా గొలుసులలో పూర్తిగా అంతర్భాగం కావడమే!అనేక దేశాల్లో చైనా వ్యతిరేక భావనలు ప్రబలంగా ఉన్నప్పటికీ, బీజింగ్ తన ఆర్థిక స్థానాన్ని ఏటికేటికీ బలపరచుకుంటూనే ఉంది. వాణిజ్యపరమైన భావోద్వేగాలు, రాజకీయ వైరుధ్యాలకన్నా ఆర్థిక అంశాలే ప్రాధాన్యం వహిస్తాయని ఇక్కడ రుజువు అవుతోంది. ఉత్పత్తులు నాసిరకంగా ఉంటాయనే వాదనతో వాణిజ్య బహిష్కరణలకు, వ్యతిరేక భావనలకు గురవుతున్న ఏకైక దేశం చైనాయే. డ్రాగన్‌తో అత్యధికంగా వాణిజ్యం జరిపే దేశాలే తరచూ చైనా వస్తు బహిష్కరణకు పిలుపివ్వడం, ఆర్థిక ఆంక్షలు విధించడం, విపరీతంగా సుంకాలు విధించడం గమనార్హం. బీజింగ్ వస్తు బహిష్కరణకు వినియోగదారుల ఉద్యమాలూ జరుగుతున్నాయి. ఇలాంటి పిలుపులు 2010 దశకంలోనూ, కొవిడ్-19 తరవాత మరింత ఊపందుకున్నాయి.

గరిష్ఠ స్థాయికి వాణిజ్య లోటు...

చైనాలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఐరోపా విమర్శలు గుప్పిస్తూ వచ్చింది. డ్రాగన్ తయారీ స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు జాతీయ భద్రతకు ముప్పు తెచ్చిపెడతాయనే ఆందోళనలు అక్కడ వ్యక్తమవుతున్నాయి. అందుకే చైనీస్ వస్తువులపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించాలని ఐరోపా దేశాల విధానకర్తలు, పారిశ్రామిక వర్గాలపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా సైతం చైనా నుంచి వస్తు దిగుమతులను తగ్గించుకోవడానికి అనేక పద్ధతులను వినియోగిస్తోంది. ముఖ్యంగా దేశీయ వస్తూత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహకాలిస్తోంది. సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, ప్రభుత్వ కొనుగోళ్లలో స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యమివ్వడం, చైనా ఎగుమతులపై అధిక సుంకాలు, వాణిజ్య ఆంక్షలు విధించడం వంటి వ్యూహాన్ని చేపట్టింది.విస్తీర్ణ పరంగా చైనా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశం, అత్యధిక జనాభా కలిగిన రెండో దేశం. సహజ వనరులకూ లోటులేదక్కడ. చైనా వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీడీపీ పరంగా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దీర్ఘకాలిక విధానాలు, భారీ పెట్టుబడులు, ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానం కావడం వంటి చర్యలతో ప్రపంచ ఆర్థిక శక్తిగా స్థిరపడింది. చైనా 14 పొరుగు దేశాలతో భూసరిహద్దులను పంచుకుంటోంది. వాటిలో కొన్ని భాగాలు వివాదాస్పదంగా ఉన్నాయి. అందుకే భారత్, వియత్నాం సహా మరికొన్ని పొరుగు దేశాలతో డ్రాగన్‌కు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేసియా, బ్రూనై, తైవాన్, జపాన్ వంటి దేశాలతో చైనాకు తీవ్రమైన సముద్ర వివాదాలున్నాయి. ఇవే పొరుగు దేశాల్లో చైనా వస్తు బహిష్కరణ ఉద్యమాలకు ఊపునిస్తున్నాయి. 1962 యుద్ధ సమయంలోనే భారత్‌లో చైనీస్ వస్తు బహిష్కరణకు బీజం పడింది. 2020 జూన్‌లో గల్వాన్ ఘర్షణలు భారతీయుల్లో చైనా వ్యతిరేకతను మరింత పెంచాయి.చైనా నుంచి దిగుమతులను చేసుకోవాల్సిన అగత్యాన్ని తప్పించడానికీ, స్వదేశీ వస్తువులకు ఆదరణ పెంచడానికీ 'మేకిన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాలను రూపొందించారు. అయినాసరే, చైనా ఇప్పటికీ భారతదేశ అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా కొనసాగుతోంది. పారిశ్రామిక విడిభాగాలు, ముడిసరుకుల కోసం డ్రాగన్‌పై ఆధారపడుతూనే ఉండటం వల్ల మొన్న జూన్ నాటికి చైనాతో భారత వాణిజ్య లోటు మునుపెన్నడూ లేనంతగా 11,216 కోట్ల డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా చైనా ఎగుమతులు 17.6శాతం పెరిగి, రికార్డు స్థాయిలో 2.12లక్షల కోట్ల డాలర్లకు చేరాయి.

అతిగా ఆధారపడుతున్నాం

భారతదేశంలో చైనా స్మార్ట్‌ఫోన్లు, గేమ్ యాప్‌లకు విపరీతమైన ఆదరణ ఉంది. దీనివల్ల చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు పెరగడంతో పాటు మన డేటా గోప్యతకూ, జాతీయ భద్రతకూ ముప్పు వాటిల్లే ప్రమాదముంది. దశాబ్ద కాలంగా భారత్‌కు చైనా నుంచి దిగుమతులు అధికమవుతున్నాయి. 2014లో 5,420 కోట్ల డాలర్లుగా ఉన్న ఆ దిగుమతులు 2019లో 7,480 కోట్ల డాలర్లకు, 2024 నాటికి 12వేల కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ ఏడాదిలో అవి 14వేల కోట్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా. చింతించాల్సిన విషయమేమంటే, ఇదే కాలంలో చైనాకు భారతీయ ఎగుమతులు పెద్దగా పెరగకపోవడం! 2014లో చైనాకు ఇండియా ఎగుమతులు 1,340 కోట్ల డాలర్లు కాగా, 2024 నాటికి అవి 2,810 కోట్ల డాలర్లకు పెరిగి, 2026 నాటికి 1,948 కోట్ల డాలర్లకు తగ్గిపోయాయి. దీని అర్థం- చైనాపై ఇండియా అతిగా ఆధారపడుతోందే, చైనీస్ మార్కెట్‌కు తన ఎగుమతులను పెంచుకోవడానికి తీవ్రంగా కష్టపడుతోందే అని!దీన్ని సరిదిద్దడం భారతదేశ దీర్ఘకాలిక వ్యూహం కావాలి. ఇతర దేశాల సరఫరా గొలుసులను ఉపయోగించుకోవడం, దేశీయ తయారీని, ఎగుమతి పోటీతత్వాన్నీ మెరుగుపరచడం ద్వారా భారత్ స్వావలంబన దిశగా పరుగులు తీయాలి. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం వంటి ముఖ్యమైన కార్యక్రమాలు రక్షణ, పునరుత్పాదక ఇంధన వనరులు, ఫార్మాస్యూటికల్స్ వంటి ప్రాధాన్య రంగాల్లో కొన్ని ప్రయోజనాలను అందించాయి. ఈ రంగాల్లో దేశీయ సామర్థ్యం గణనీయంగా విస్తరించి, దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. కానీ ముడి చమురు, సెమీకండక్టర్ భాగాలు, అధునాతన పారిశ్రామిక సాంకేతికత, తయారీ పరికరాల దిగుమతులపై ఇప్పటికీ ఆధారపడక తప్పడం లేదు. దాంతో అన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధించాలనే లక్ష్యానికి భారత్ ఇంకా చాలా దూరంగానే ఉండిపోవాల్సి వస్తోంది.

# ఆపరేషన్ సక్సెస్..బట్..

ఇరాన్:ఇరాన్ దక్షిన తీరంలో మెరుపు దాడితో అమెరికా ఖుషీ ఖుషీ అవుతోంది. హోర్ముజ్ 40 ఓడలను జలసంధిని దాటించి చరిత్ర సృష్టించింది. కానీ ఇక్కడే ఇరాన్ ను అమెరికా తక్కువ అంచనా వేస్తోంది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దూకుడును ఎలా కట్టడి చేస్తుందో సమాధానం దొరకని ప్రశ్న మధ్య ప్రాచ్య దేశాలను వణికిస్తోంది. ఇరాన్, అమెరికాల మధ్య మరో విడత దాడులు జరుగుతున్న తరుణంలో, 1.8 కోట్ల బ్యారెళ్ల చమురును తీసుకు వెళ్తున్న 40 వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం హోర్ముజ్ జలసంధి గుండా దాటించిందని, ఈ యుద్ధకాలంలోనే అత్యధికమని ఈ ఆపరేషన్ల గురించి అమెరికా అధికారులు తెలిపారు.కేవలం ఆరు నెలల కిందట యుద్ధం ప్రారంభం కావడానికి ముందు, ఈ జలసంధి గుండా రోజుకు సుమారు 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయ్యేది.లక్షలాది బ్యారెళ్ల చమురును తీసుకు వెళ్తున్న ఈ నౌకలకు ప్రమాదకర రక్షణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నప్పుడు, అమెరికా తన వాయు, సముద్ర, అంతరిక్ష ఆస్తులను ఉపయోగించి, జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడి చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, డ్రోన్ దాడుల పరంపరను కూడా తిప్పికొట్టిందని ఆ అధికారులు తెలిపారు. ఈ రక్షణ ఆపరేషన్ సమయంలో అమెరికా దళాలు నౌకా విధ్వంసక క్రూయిజ్ క్షిపణులను కూడా నిర్వీర్యం చేశాయని అధికారి తెలిపారు. ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన "పూర్తిస్థాయి ఒత్తిడి"లో భాగంగా, జలసంధి చుట్టూ లక్ష్యాలపై దాడి చేయడానికి అమెరికా ఈ యుద్ధంలో తన వ్యూహాన్ని రచిందింది. ఈ కీలక జలమార్గం గుండా వాణిజ్య నౌకలకు రక్షణగా వెళ్లే కార్యకలాపాలను నిర్వహించడానికి, ఇరాన్ ఓడరేవులపై తన నావికా దిగ్బంధనాన్ని కొనసాగించడానికి ప్రాధాన్యతనిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఆపరేషన్ సక్సెస్ సరే..

ఈ ఆపరేషన్ విజయవంతమైనప్పటికీ, ఈ సంఘర్షణకు త్వరిత పరిష్కారం దగ్గరలో ఉందనే భ్రమల్లో అధికారులు లేరు. సైనిక రక్షణ ఉన్నప్పటికీ, తమ నౌకలను జలసంధి గుండా పంపడంలో భారీ ప్రమాదాల గురించి ఇంధన కంపెనీలు ఇప్పటికీ ఆందోళన చెందుతున్నాయి. అంతేకాకుండా, ఇంధన ధరలు అధికంగానే ఉండటంతో, ప్రపంచ బాండ్ మార్కెట్‌లో అస్థిరత ఏర్పడుతోంది.ఇరాన్ అణు కార్యక్రమంలోని అంశాలను నిర్మూలించడంపై దృష్టి సారించిన ఆపరేషన్లతో సహా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఇతర ప్రాధాన్యతలను ప్రస్తుతానికి పక్కన పెట్టారు. తన ప్రయత్నాలన్నింటినీ జలసంధిపైనే అమెరికా సెంట్రల్ కమాండ్ కేంద్రీకరించింది. ఇరాన్ ఓడరేవుల నుండి చమురు ఎగుమతులు జరగకుండా, ఓడరేవులోకి ప్రవేశించకుండా నిరోధించాలని సెంట్రల్ కమాండ్ ఆదేశాలు జారీ చేసింది.గత సంవత్సరం మూడు కీలక అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులలో పూర్తిగా ధ్వంసం కాని ఇరాన్ అత్యంత సుసంపన్న యురేనియం నిల్వలను భూగర్భంలోనే ఉంచి, ఉపగ్రహ చిత్రాల ద్వారా పర్యవేక్షించడానికి తాను సంతృప్తిగా ఉన్నానని ట్రంప్ స్వయంగా ఇటీవల సూచించారుప్రస్తుత వ్యూహానికి అనుగుణంగా మంగళవారం అమెరికా బహుముఖ ఆపరేషన్‌ను నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో జలసంధి చుట్టూ దాదాపు 60 సైనిక లక్ష్యాలపై దాడి చేసింది. వీటిలో వాయు రక్షణ స్థావరాలు, రాడార్ వ్యవస్థలు, సముద్ర ఆస్తులు, మైన్ – – లేయింగ్ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ సైట్‌లు ఉన్నాయి. అదే సమయంలో నౌకలకు రక్షణగా నిలిచింది .ఇరాన్ తన సామర్థ్యాలను నిరంతర నిర్వహణ అవసరమయ్యే రీతిలో పునరుద్ధరించుకోగలదని నిరూపించుకుంది. అమెరికా సైన్యం జలసంధి సమీపంలో దాడులను కొనసాగించాలని భావిస్తోంది, వాణిజ్యపరంగా ఈ దాడులు బెదిరింపే, ఇరాన్ సామర్థ్యాన్ని తగ్గించే లక్ష్యంతో "గడ్డిని కోయడం" లేదా "వాక్-ఎ-మోల్" ఆట ఆడటం అని అమెరికా అధికారుల భావన.

ఇరాన్ బలం తగ్గింపే లక్ష్యం

జలసంధిలో ఇరాన్ సామర్థ్యాన్ని క్రమపద్ధతిలో తగ్గించే విస్తృత సైనిక వ్యూహంలో ఇవి ఒక కీలక భాగం కూడా.అయినప్పటికీ, ఈ బహుముఖ సైనిక చర్యలు చివరికి ఇరాన్‌ను లొంగిపోయేలా చేస్తాయా లేదా అనేది వేచి చూడాలి ఒకవేళ చేసినా, అలా జరగడానికి ఎంత సమయం పడుతుందో కూడా చూడాలి. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, ఈ వారం ప్రారంభంలో జలసంధి గుండా ప్రవహించే చమురులో పెరుగుదల ఉందని



ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ సూచించారు. సోమవారం ఆ ఎగుమతులు రోజుకు 17 మిలియన్ బ్యారెళ్లకు చేరి యుద్ధకాలపు రికార్డును బ్రేక్ చేసింది .

కంపెనీల్లో అదే ఆందోళన

ఇంతలో, ఈ జలసంధి గుండా ప్రయాణించాలని నిర్ణయించుకునే వాణిజ్య రవాణాదారులు, చాలావరకు ప్రతి కేసును బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ పరిస్థితులపై అవగాహన ఉన్న ఇద్దరు వ్యక్తులు తెలిపారు. ఈ జలసంధి గుండా ఒక చమురు ట్యాంకర్‌ను అద్దెకు తీసుకునే ధర కూడా విపరీతంగా పెరిగిపోయింది. కొన్ని అంచనాల ప్రకారం దీని ఖర్చు రోజుకు $500,000 కంటే ఎక్కువగా ఉంది. ఇది, ఈ ప్రయాణానికి పూనుకోవడానికి సిద్ధంగా ఉన్న చార్టర్ కంపెనీలకు అదనపు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. మొత్తం పరిశ్రమ ఇంకా మరింత భరోసా కోసం ఎదురుచూస్తోంది. యుద్ధం ప్రారంభంలో విపరీతంగా పెరిగిన ఓడల బీమా ఖర్చు ఇప్పటికీ అధికంగానే ఉంది. ఇది సముద్రయాన కంపెనీలు చేస్తున్న క్లిష్టమైన లెక్కలకు మరింత ఆజ్యం పోస్తోంది. ఒకవేళ ఈ ప్రయత్నాలు విజయవంతం కాకపోయినా, జలసంధి గుండా వెళ్లే ఓడలపై ఇరాన్ దాడులు జరుగుతున్నాయనే నిరంతర నివేదికలు ఒక నిరోధకంగానే మిగిలిపోయాయి.

జలమార్గం గుండా రవాణా సరుకులలో చమురు కూడా ఒక రూపం మాత్రమే. ఇరాన్ చుట్టూ అమెరికా సైనిక కార్యకలాపాల ప్రకారం, ద్రవీకృత సహజ వాయువు వంటి ఇతర ఇంధన వనరులను మోసుకెళ్లే ట్యాంకర్లు మరింత జాగ్రత్త వహిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఎందుకంటే, ఒకవేళ ఆ రకమైన సరుకును మోసుకెళ్తున్న నౌకలపై ఇరాన్ డ్రోన్, మైన్ లేదా క్షిపణి దాడి జరిగితే సంభవించే విపత్కర పరిణామాల దృష్ట్యా ఈ జాగ్రత్త అవసరం. కొంతమంది అమెరికా అధికారులు అంగీకరిస్తున్నదేమిటంటే, జలసంధి సమీపంలో ఉన్న ఇరాన్ సైనిక ఆస్తుల (ఇటీవలి పోరాట విరామ సమయంలో కనీసం పాక్షికంగానైనా పునరుద్ధరించబడిన సామర్థ్యాలు) అసంపూర్ణ లక్ష్యాల జాబితాను పూర్తి చేయడానికి మాత్రమే కాకుండా, ప్రయాణం సురక్షితమని నౌకా రవాణా పరిశ్రమను ఒప్పించడానికి కూడా అమెరికా సైన్యానికి సమయం పట్టుదల అవసరమయ్యే అవకాశం ఉంది.రెండవది, మంగళవారం జరిగినటువంటి నిరంతర రక్షణ కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా సాధ్యమవుతుంది. ఆ రోజు అమెరికా దళాలు, మందుపాతరలను తొలగించిన ఒక మార్గం గుండా వాణిజ్య నౌకలకు మార్గనిర్దేశం చేశాయి. వచ్చే నెల నాటికి, ఆ జలమార్గం గుండా ప్రవహించే చమురు పరిమాణాన్ని క్రమంగా పెంచే లక్ష్యంతో, నౌకలు మరింత స్వేచ్ఛగా సంచరించడానికి వీలుగా ఆ మార్గాన్ని విస్తరించాలని అమెరికా సైన్యం ఆశిస్తోంది.సంఘర్షణ ప్రారంభంలో, అమెరికా సైన్యం 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' అనే పేరుతో ఇలాంటి రక్షణ చర్యను ప్రారంభించడానికి ప్రయత్నించింది. అయితే, ఈ ప్రకటన సౌదీ అరేబియా వంటి కీలక గల్ఫ్ మిత్రదేశాలను ఆశ్చర్యానికి గురిచేయడంతో, ఇరాన్‌పై కార్యకలాపాల కోసం అమెరికా స్థావరాలను ఏర్పాటు చేసుకోవడానికి విమాన సర్వీసులను నడపడానికి అనుమతిని నిరాకరిస్తామని బెదిరింపులు రావడంతో ఆ చర్యను వెంటనే నిలిపివేశారు. కొన్ని నెలల తర్వాత, యుద్ధం ఒక కొత్త దశలోకి ప్రవేశించినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులు ప్రారంభిస్తుండటంతో, జలసంధి గుండా రక్షణ చర్యలకు ప్రాంతీయ భాగస్వాముల నుండి మరింత మద్దతు లభిస్తోందని ఈ ఆపరేషన్ గురించి తెలిసిన తొలి అధికారి తెలిపారు.

# బంధం... బలపడుతోంది....



విజయవాడ,ఏపీలో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. మూడు పార్టీల కూటమి ఒక వైపు.. మరోవైపు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ మూడు పార్టీల మధ్య బంధం స్ట్రాంగ్ గా ఉంది. అలా ఉన్నంతవరకు ఆ కూటమిని వైసిపి ఏం చేయలేదు అనేది మెజారిటీ విశ్లేషకుల భావన. అయితే ఐక్యం అనేది ఆ మూడు పార్టీల ఇష్టం. వైసిపి గెలవాలి అనుకున్నవారు కూటమి విచ్ఛిన్నం కావాలని కోరుకుంటారు. మెజారిటీ వైసీపీ శ్రేణులు కోరుకునేది అదే. అందుకే ఆ మూడు పార్టీల మధ్య విఘాతానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, లోకేష్ల మధ్య గట్టి తగాదా రావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ రోజు రోజుకి వారి మధ్య బంధం పెరుగుతూనే ఉంది కానీ.. తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో నారా లోకేష్ చేసిన ప్రకటన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ఈరోజు. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీల శ్రేణులు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే అందరికంటే నారా లోకేష్ శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలిచాయి. సినీ అభిమానుల దృష్టిలో పవర్ స్టార్.. జనసైనికుల దృష్టిలో సేనాని.. నాకు మాత్రం దేవుడు ఇచ్చిన అన్న పవన్ అంటూ సంబోధించారు నారా లోకేష్. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆ పార్టీ మీడియాతో పాటు సోషల్ మీడియా ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తున్నాయి.పవన్ కళ్యాణ్ విషయంలో లోకేష్ మాత్రం చాలా ప్రత్యేకంగా చూస్తుంటారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత. లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ వారిద్దరి మధ్య బంధం బాగానే ఉంటుంది. అది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించదు. అందుకే లోకేష్ పవన్ విషయంలో స్పందించిన ప్రతిసారి వైసీపీకి ఎక్కడలేని కోపం. వారు భాగస్వామ్య పార్టీల అధినేతలు. ఆ పైవారు పరస్పరం గౌరవించుకుంటున్నారు కానీ ఈ విషయంలో ఎందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా రియాక్ట్ అవుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం వైసీపీ అనుకూల మీడియాతో పాటు సోషల్ మీడియాలో.. పవన్ కళ్యాణ్ ను ఆకాశానికి ఎత్తేస్తున్న లోకేష్ అంటూ శీర్షికలు పెట్టి కథనాలు రాస్తున్నారు. వాళ్లు స్నేహితులు. వారు చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అసలు ఈ విషయంలో వైసీపీకి ఎందుకు అంత ఉత్సాహం? అంటే వారు కలిసి ఉంటే తనకు సుఖం ఉండదు. తనకు విజయం దక్కాలంటే వారు కలిసి ఉండకూడదు. కానీ వారి మధ్య బంధం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు.

జెన్ జీ జపంలో జనసేనాని

ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ పుట్టినరోజు సందర్భంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జనసేన. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం పేరును 'జై కొట్టు' గా నామకరణం చేసింది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నూతన విభాగం 'జై కొట్టు'ను ఆవిష్కరించారు. జై కొట్టు పేరుతో ప్రత్యేకంగా ఒక పాటను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ పాట షేక్ చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకాయి.పవన్ కళ్యాణ్ గత కొద్దిరోజులుగా కేరళలో ఉంటున్న సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అక్కడ ప్రకృతి వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. అందుకే తన జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా పవన్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఎక్కడికక్కడే బైక్ ర్యాలీలు చేపడుతున్నారు.. ఆలయాల్లో పూజలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనసేనకు ముఖ్యంగా యువత బలం అధికం. అందుకే ఆ పార్టీ యువజన విభాగానికి ప్రత్యేక నామకరణం చేయాలని భావించారు. అందుకు పవన్ పుట్టినరోజు వేడుకలను వేదికగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ జన్మదిన వేడుకల్లో పార్టీ యువజన విభాగానికి జై కొట్టు అనే ప్రత్యేక పేరును పెట్టారు.మరోవైపు ఈ జై కొట్టు అనే నినాదానికి.. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పాత తోడైంది.' జై కొట్టు' పేరుతో ప్రత్యేకంగా పాటను కూడా విడుదల చేశారు. ఈ పాటకు థమన్ మ్యూజిక్ అందించారు.. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోయారు.

# సింహపురిలో బిగ్ ఫైట్

నెల్లూరు,నెల్లూరు జిల్లా రాజకీయాల్లో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం మరియు ఆధిపత్య పోరు ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ముఖ్యంగా జిల్లాలో సాగుతున్న క్వార్ట్జ్ మైనింగ్ వివాదం మరియు అంతర్గత రాజకీయ విభేదాల నేపథ్యంలో, వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టార్గెట్ చేస్తూ అత్యంత ఘాటు వ్యాఖ్యలతో సవాల్ విసిరారు."ప్రభాకర్ రెడ్డి.. నువ్వు నిజంగా మొగోడివైతే వెనక ఉండి రాజకీయం చేయడం ఆపి, నేరుగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడు" అంటూ బహిరంగంగా సవాల్ చేశారు. తనపై లేదా వైఎస్సార్సీపీ నేతలపై ఎలాంటి ఆరోపణలు చేయాలన్నా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడాలని నల్లపురెడ్డి డిమాండ్ చేశారు. మీ ఇంట్లో బాత్రూమ్‌లు కడిగే వాళ్లతోనో, సమాజంలో తిరిగే బ్రోకర్ గాళ్లతోనో ప్రెస్ మీట్లు పెట్టించి మాపై మాట్లాడించడం నీకు పద్ధతి కాదంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తెరవెనుక ఉండి ఇతరుల ద్వారా ఇంటర్వ్యూలు ఇప్పించే దొంగచాటు రాజకీయాలు మానుకొని ధైర్యంగా తలపడాలని ఆయన హితవు పలికారు. ఇదే క్రమంలో మాజీ మంత్రి, వైస్సార్సీపీ కీలక నేత అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తావనను నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గట్టిగా లేవనెత్తారు. "నీకు అనిల్ కుమార్ యాదవ్ అంటే ఎందుకంత భయం? ఆయన పేరు వింటేనే ఎందుకు వణికిపోతున్నావు?" అంటూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. అనిల్ కుమార్ యాదవ్ గతంలో మైనింగ్ వ్యవహారాలపై సంధించిన ప్రశ్నలకు, చేసిన విమర్శలకు చేతనైతే మీడియా ముందుకు వచ్చి నేరుగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక, మైనింగ్ మరియు రాజకీయ అక్రమాలకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సమయం వచ్చినప్పుడు వాటన్నింటినీ ఆధారాలతో సహా ప్రజల ముందు బయటపెడతామని, మిమ్మల్ని అంత సులభంగా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులపై వైఎస్సార్సీపీ నేతలు చేసిన విమర్శలు, ఆ తర్వాత జరిగిన దాడుల నేపథ్యంలో ఈ తాజా కౌంటర్ నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# 2 వేలు తగ్గిన బంగారం ధరలు

ముంబై, ప్రతి రోజు బంగారం, వెండి ధరల్లో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు గణనీయంగా తగ్గుముఖం పట్టడం కొనుగోలుదారులకు భారీ ఊరటనిచ్చేలా ఉంది. అయితే తాజాగా సెప్టెంబర్ 2న బుధవారం ధరలను పరిశీలిస్తే తులం బంగారంపై భారీ స్థాయిలో దిగి వచ్చింది. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తులం బంగారం ధర రూ.1,56,930 ఉండగా, ఇప్పుడు మాత్రం రూ.1,54,080 వద్ద కొనసాగుతోంది. అంటే ఒకే రోజు రూ.2,800పైగా తగ్గుముఖం పట్టింది. ఇక వెండి విషయానికొస్తే.. ఇది కూడా భారీగానే తగ్గుతోంది. గత వారంలో కిలో వెండి ధర రూ.2,60,000 ఉండగా, ప్రస్తుతం కిలో సిల్వర్ ధర రూ.2,49,900 వద్ద ట్రేడవుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో ధరల వివరాలు

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,080 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,240 వద్ద కొనసాగుతోంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,240 వద్ద ట్రేడవుతోంది.

ఇతర రాష్ట్రాల్లో..

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,230 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,390 వద్ద ట్రేడవుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,240 వద్ద ట్రేడవుతోంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,240 వద్ద ట్రేడవుతోంది.కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,080 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,240 వద్ద ట్రేడవుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,630 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,740 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ పరిణామాలతో పాటు మన దేశంలోనూ పసిడి సెంటిమెంట్‌ను దెబ్బతీసే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అత్యవసరమైతే తప్ప అనవసరంగా గోల్డ్ కొనుగోలు చేయవద్దంటూ ప్రధాని నరేంద్ర మోదీ పౌరులకు చేసిన విజ్ఞప్తి స్వదేశీ బులియన్ మార్కెట్‌లో కొత్త చర్చకు దారితీసింది. ఈ ప్రకటన అంతర్జాతీయ మార్కెట్‌ను నేరుగా ప్రభావితం చేయకపోయినా, రాబోయే పండుగల సీజన్‌లో భారత్‌లో ఆభరణాల డిమాండ్‌పై కొంత ప్రభావం చూపే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# ఇరుకురోడ్ల విస్తరణ పనులు షురూ...

హైదరాబాద్, హైదరాబాద్ కేబీఆర్ పార్క్ చుట్టూ అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానం 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను గమనించారు. బాటిల్‌నెక్స్ తొలగించేందుకు రోడ్ల విస్తరణ, మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, యుటిలిటీల తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానం అమలవుతున్న సంగతి తెలిసిందే. కొత్త అండర్‌పాసులు, బ్రిడ్జిల నేపథ్యంలో ఈ మార్గంలో వన్‌వే విధానం అమలు చేస్తున్నారు. అయితే వన్ వే తీరుతెన్నులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వన్ వే అమల్లోకి వచ్చి దాదాపు 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు గమనించిన అంశాలు, ఆ మార్గంలోని వాహనదారుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నం.45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు మెయిన్‌గేట్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు.ఆయా జంక్షన్ల వద్ద వెహికల్స్ ఆటంకం లేకుండా సాఫీగా ముందుకు సాగిపోయేలా చేపట్టాల్సిన దిద్దుబాటు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. వెహికల్స్ వేగం మందగిస్తున్న బాటిల్ నెక్ ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్లను మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి రోడ్ నం.45 జంక్షన్ మధ్య వెహికల్స్ రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రాధాన్య క్రమంలో

# ఆ నిధులు మాకొద్దు- ఆరెస్సెస్ కు 90 మంది అమెరికా రాజకీయ నాయకుల షాక్..!

వాషింగ్టన్:అమెరికాలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ పర్యటన తర్వాత రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. స్వదేశంలో ఇతర మతాలపై వివక్ష చూపిస్తూ... అమెరికాకు వచ్చి మత సామరస్యం, విశ్వ ఐక్యత అంటూ ప్రసంగాలు చేసిన మోహన్ భగవత్ తీరుపై అక్కడి రాజకీయ నాయకులు (ఖూ ్ఖుఒఖునెవతీం) అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోతున్నారు. ఇందులో భగవత్, ఆరెస్సెస్ తీరుపై ఆగ్రహంగా ఉన్న భారత సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యులు రో ఖన్నా, ప్రమీలా జయపాల్ సహా 90 మంది అమెరికా రాజకీయ నాయకుల బృందం.. ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థల నుండి వచ్చే విరాళాల్ని తిరస్కరిస్తామని ప్రతిజ్ఞ చేసింది.మోహన్ భగవత్ టూర్ కు వ్యతిరేకంగా అమెరికాకు చెందిన హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ యాక్షన్, సేక్రెడ్ యాక్ట్స్, వారి భాగస్వాములు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఇందులో హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్ యాక్షన్ అనేది అమెరికాకు చెందిన ఒక రాజకీయ ప్రచార బృందం. సేక్రెడ్ యాక్ట్స్ అనేది ఓ కూటమి. ఈ రెండు సంస్థలు మానవ హక్కులు, ప్రపంచ దేశాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై స్థానికంగా అవగాహన కల్పించేందుకు పనిచేస్తున్నాయి. ఇప్పుడు వీటిలో ఉన్న 90 మంది యూఎస్ కాంగ్రెస్ సభ్యులు, రాష్ట్ర శాసనసభ్యులు, మేయర్లు, స్థానిక ఎన్నికైన అధికారులు, అలాగే డెమోక్రటిక్స, రిపబ్లికన్ వర్గాలకు చెందిన అభ్యర్థులు



ఆరు పేజీల ప్రతిజ్ఞపై సంతకాలు చేశారు.రాజకీయ హింస, బెదిరింపుల్ని తిరస్కరించాలని, అలాగే గతంలో ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న సంస్థల నుండి స్వీకరించిన డబ్బును తిరిగి ఇచ్చేయాలని లేదా దానిని ప్రజాస్వామ్యానికి మద్దతు ఇచ్చే సంస్థలకు మళ్లించాలని రాజకీయ నాయకులకు వీరు పిలుపునిచ్చారు. అయితే వీరికి వ్యతిరేకంగా.. ఆరెస్సెస్, భగవత్ కు మద్దతుగా హిందూ అమెరికన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ అనే మరో సంస్థ.. ఇది తీవ్రవాద వామపక్ష సంస్థల పనిగా అభివర్ణించింది. ఇది అమెరికా వ్యతిరేక, హిందూ వ్యతిరేకమైనదని తెలిపింది.

# కాంగ్రెస్‌లో కొండా దంపతుల కథ ముగిసినట్లే !

హైదరాబాద్,మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ప్రారంభం కానున్నాయి. రాజీనామా చేసి ఉంటే పార్టీలో పరిస్థితులు మారాకా మంచి రోజులు వస్తాయని అనుకునేవారు. కానీ హైకమండ్ ను సైతం ధిక్కరించడంతో ఉద్వాసన తప్పలేదు. స్వయంగా ముఖ్యమంత్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం, పార్టీ క్రమశిక్షణను ఖాతరు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. బర్తరఫ్ తర్వాత ఇక కాంగ్రెస్ గూటిలో ఆత్మాభిమానంతో కొనసాగడం కొండా కుటుంబానికి ఏమాత్రం సాధ్యం కాదనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.హైకమాండ్ వద్ద తమ వాదనను వినిపించేందుకు ఢిల్లీకి వెళ్లి ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. క్రమశిక్షణా ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ పెద్దలు సైతం వీరి విషయంలో ఎలాంటి ఉ పశమనం ఇవ్వడానికి నిరాకరించారు. సంక్షోభం తలెత్తిన ప్రారంభ దశలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సురేఖ స్వయంగా రాఖీ కట్టి వివాదానికి తెరదించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత కూడా ఆమె శైలిలో మార్పు రాలేదు. ఏ దశలోనూ పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు, డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు కొండా దంపతులు ప్రయత్నించకపోగా.. రోజురోజుకూ ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తూ పార్టీ అధినాయకత్వంతోనే తెగతెంపులు చేసుకునే స్థాయికి వివాదాన్ని తెచ్చుకున్నారు.కొండా దంపతుల రాజకీయ గతాన్ని పరిశీలిస్తే ఎక్కడా కూడా రాజీపడే తత్వం వారికి కనిపించదు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ, ఆ తర్వాత బీఆర్ఎస్‌లోనూ అధిష్ఠానాలతో విభేదించే బయటకు వచ్చారు. తాజాగా కాంగ్రెస్‌లో కూడా తమ పాత ధోరణినే కొనసాగించి సొంత కాళ్లపై గొడ్డలి వేసుకున్నారు. కేబినెట్ నుంచి తప్పించిన వెంటనే వరంగల్ జిల్లాలో ప్రత్యామ్నాయంగా గుండు సుధారాణి, ఇతర బీసీ నేతలను రేవంత్




రెడ్డి తెరపైకి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలోనూ కొండా కుటుంబానికి పట్టు సడలే ప్రమాదం ఏర్పడింది. దీంతో సొంత పార్టీలోనే ఉంటూ రాజకీయంగా మనుగడ సాగించడం వారికి దాదాపు అసాధ్యంగా మారింది.ఈ పరిస్థితుల్లో తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, వరంగల్ కోటపై పట్టు నిలుపుకోవడానికి కొండా దంపతులు కొత్త రాజకీయ గమ్యాన్ని వెతుక్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది. వారి ఎదుట మిగిలి ఉన్న ఏకైక బలమైన ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమే. తెలంగాణలో దూకుడుగా వెళ్తున్న బీజేపీ కూడా ఉమ్మడి వరంగల్‌లో బలమైన మాస్ లీడర్ల కోసం చూస్తున్న వేళ.. కొండా మురళి, సురేఖల చేరిక వైపు అడుగులు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు రాంరాం చెప్పి కాషాయ కండువా కప్పుకోవడమే వారి తదుపరి రాజకీయ అస్త్రం అవుతుందన్న చర్చలు జోరందుకున్నాయి.

# సూర్యాపేట టీపీవో ఆస్తుల విలువ 3.54 కోట్లపైనే



సూర్యాపేట/హయత్‌నగర్, సూర్యాపేట మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న ఉయ్యాల సోమయ్య ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణల నేపథ్యంలో ఉదయం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సూర్యాపేటలోని మానసనగర్‌లోని సోమయ్య నివాసంలో అవినీతి నిరోధక శాఖ నల్లగొండ రేంజ్‌కు చెందిన ఏసీబీ అధికారులు టీపీవో నివాసం, కార్యాలయంతోపాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఉదయం సోదాలు నిర్వహించి పలు ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను గుర్తించారు. వీటిలో సూర్యాపేట జిల్లాలో మూడెకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్‌లో ఐదు నివాస ఆస్తులు, సూర్యాపేట పరిధిలో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్టు గుర్తించారు.బంగారం 709 గ్రాములు, వెండి 1,750 గ్రాములు,

# మరింత భీకరంగా ఎల్ నినో.. నైరుతి రుతుపవనాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం



న్యూఢిల్లీ,ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఎల్ నినో తీవ్రత గణనీయంగా పెరిగింది. ఇది ఈ ఏడాది చివరి నాటికి అత్యంత శక్తివంతమైన స్థాయికి చేరుకుంటుందని అంచనా. అంతేగాకుండా ఇది 2027 ఫిబ్రవరి వరకు కచ్చితంగా ఉంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. ఈ హెచ్చరిక కేవలం దీని కొనసాగింపునకు మాత్రమే పరిమితం కాదు.ఈ ఏడాది చివరి వరకు ప్రస్తుత ఉష్ణోగ్రత పెరుగుదల ధోరణి కొనసాగితే ఆధునిక పర్యవేక్షణ ప్రారంభమైనప్పటి నుంచి అత్యంత శక్తివంతమైన ఎల్ నినోగా ఇది మారే అవకాశం ఉందని డబ్ల్యూఎంవో అధికారులు తెలిపారు. ఎల్ నినో తీవ్రతకు సంబంధించి ఆ సంస్థ ఇంతటి అధిక స్థాయి విశ్వాసాన్ని వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి అని గురువారం విడుదలైన తాజా డబ్ల్యూఎంవో నివేదిక సూచిస్తున్నది. సముద్రపు ఉష్ణోగ్రతలు అసాధారణంగా ఎక్కువగా ఉండటం వల్ల ఎల్ నినో మరింత బలపడుతున్నదని, దీనికి సంబంధించిన వాతావరణ ప్రభావాలు 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

భారత్‌పై ప్రభావం

ఎల్ నినో అన్ని ప్రాంతాలలో ఒకే రకమైన వాతావరణ పరిస్థితులను సృష్టించదు. అలాగే ఒక నిర్దిష్ట దేశం ఎంత తీవ్రంగా ప్రభావితమవుతుందనేది కేవలం దాని తీవ్రతపైనే ఆధారపడి ఉండదు. అయితే భారత్‌కు సంబంధించినంత వరకు ఇది నైరుతి రుతుపవనాలపై తీవ్ర ప్రభావం చూపి పొడి వాతావరణ పరిస్థితులకు దారితీయవచ్చని అంచనా. చారిత్రకంగా ఎల్ నినో తరచుగా బలహీనమైన రుతుపవన వర్షపాతంతో ముడిపడి ఉంటుంది. అయితే ఈ సంబంధం కచ్చితమైనది కాదు.ఇతర అంశాలు ఫలితాన్ని మార్చగలవని అధికారులు తెలిపారు. 2026 రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ముందే అంచనా వేసింది. ఇప్పటివరకు అలాగే నమోదైంది. మే నెలలో విడుదల చేసిన సవరించిన అంచనాలో ఐఎండీ ఈ సీజన్ వర్షపాతం దీర్ఘకాలిక సగటు(ఎల్‌పీఏ)లో 90 శాతం ఉంటుందని, అలాగే లోటు వర్షపాతం ఉండేందుకు 60 శాతం అవకాశం ఉందని పేర్కొంది. నిరాశాజనక అంచనాలకు అనుగుణంగానే 16 శాతం లోటు వర్షపాతంతో భారత్ ఆగస్టు నెలను ముగించింది.అంతేగాకుండా సెప్టెంబర్-నవంబర్ కాలంలో దాదాపు అన్ని భూభాగాల్లోనూ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని డబ్ల్యూఎంవో తాజా అంచనా సూచిస్తున్నది. అదే సమయంలో వర్షపాత సరళి ప్రాంతాల వారీగా మారుతుందని కూడా హెచ్చరిస్తున్నది. అత్యంత తీవ్రమైన ఎల్ నినో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో విపరీతమైన వేడి, కరువు, వరదల అవకాశాలను పెంచవచ్చు. అయితే ప్రతి ప్రాంతంపై ఒకే విధమైన ప్రభావం ఉండే అవకాశం లేదు. 2027 ప్రారంభం వరకు ఎల్ నినో కొనసాగుతుందని అంచనా వేస్తున్నందున దాని వల్ల సంభవించే పర్యవసానాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉండాలని డబ్ల్యూఎంవో అధికారులు సూచించారు.

## భూభారతి పేరిట భూహారతి

సికింద్రాబాద్,ధరణి మారినా ధోరణి మారకపోగా.. భూభారతి తీసుకువచ్చి భూహారతి చేస్తున్నారు. మల్కాజిగిరి మినీ ఇండియా ఇక్కడ అన్ని రాష్ట్రాల, ప్రాంతాల వారున్నారు. రేవంత్ పుణ్యమా అని వందల కాలనీలు 22ఏ కింద నిషేధిత జాబితాలోకి వెళ్ళాయని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ప్రపంచ చరిత్ర హిట్లర్ ను దుర్మారుడుగా గుర్తు పెట్టుకుంటే, తెలంగాణ రేవంత్ రెడ్డిను గుర్తుపెట్టుకుంటుంది. చివరికి పి అండ్ టి కాలనీ, మహేంద్రహిల్స్ 22ఏ కింద పెట్టారు. అమ్ముకోకుండా, బ్యాంకులోనుకి పోకుండా చేస్తున్నారు. - ఇది ఒక తుగ్లక్ పాలన అని ప్రజలంటున్నారు. 22ఏ ను రద్దు చేయమని అడగడం లేదు. పేదల భూములు, ఇళ్లను జాబితా నుండి తొలగించమని అడుగుతున్నాం. తప్పు అధికారులు చేస్తే వారిని సర్వీస్ నుండి తొలగించండి.

# కొండా అక్క...చివరాఖరున మంచి పని చేశారు !

హైదరాబాద్,కొండా సురేఖ రాజకీయ జీవితంలో అవకాశాలు చాలా వచ్చాయి. అయితే వాటిని చాలా సులువుగా కాలదన్నుకోవడం ఆమెకు మాత్రమే తెలిసిన విద్య అంటే ఎవరైనా ఇట్టే ఏకీభవిస్తారేమో. కొండా సురేఖ వైఎస్సార్ మంత్రివర్గంలో అది కూడా ఆయన రెండో విడత 2009లో గెలిచినపుడు చేరారు. వైఎస్సార్ ఆమెను గుర్తించి మంచి అవకాశం ఇచ్చారు. అయితే వైఎస్సార్ కేవలం మూడు నెలలకే మరణించారు. దాంతో ఆయన మీద అమితమైన భక్తితో కొండా సురేఖ కూడా తన మంత్రి పదవికి రాజీనామా చేసి వదులుకున్నారు. అంటే ఆనాడు మంత్రి పదవి మూన్నాళ్ళ ముచ్చటే అన్న మాట. తిరిగి 14 ఏళ్ళ తరువాత ఆమెకు లక్కీ చాన్స్ వచ్చింది. రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో ఆమెకు చోటు దక్కింది. అలా 2023 డిసెంబర్ 7న ఆమె మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇంకా డిసెంబర్ నెల రాలేదు మూడు నెలల ముందుగానే ఆమె పదవి పోయింది. తొలినాడు మూడు నెలల మంత్రి పదవితో కలుపుకుంటే అచ్చంగా ఆమె తన రాజకీయ జీవితంలో మూడేళ్ల పాటు మంత్రిగా చేశారు అనుకోవాలి.

జనంలో ఆదరణ ఉన్నా :

నిజానికి కొండా సురేఖకు జనంలో ఆదరణ ఉంది. అందుకే ఆమె గత మూడు దశాబ్దాల కెరీర్ లో అయిదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అందులో కాంగ్రెస్ నుంచి నాలుగు సార్లు అయితే బీఆర్ఎస్ నుంచి ఒకసారి అన్న మాట. దాని కంటే ముందు 1995లో ఆమె రాజకీయ జీవితం మండల పరిషత్ చైర్మన్ గా ప్రారంభం అయింది. ఆ వెంటనే కాంగ్రెస్ లో పీసీసీ మెంబర్ అయ్యారు. ఇక పీసీసీ చీఫ్ గా వైఎస్సార్ ఆమెకు ఎమ్మెల్యేగా తొలిసారి పోటీ చేసే చాన్స్ కల్పించారు. అలా 1999లో తొలిసారి ఆమె ఎమ్మెల్యేగా శాయంపేట నుంచి గెలిచారు. 2004లో కూడా శాయంపేట నుంచి గెలిచారు. 2009లో పరకాల నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచారు. వైఎస్సార్ ఆమెకు శిశు సంక్షేమం, వికలాంగులు, బాలల సంక్షేమ శాఖ మంత్రిగా అవకాశం ఇచ్చారు. వైఎస్సార్ మరణానంతరం ఆమె తప్పుకున్నారు. ఆమె తప్ప ఆనాటి కేబినెట్ లో మిగిలిన వారు అంతా రోశయ్య మంత్రివర్గంలో చేరారు, ఆ తరువాత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో కూడా పనిచేశారు.

ఏటికి ఎదురీదడమే :

జనాదరణ బాగా ఉంది, అదే సమయంలో కాంగ్రెస్ ఆమెను ఎంతో



ఆదరించింది. అయినా సరే బీఆర్ఎస్ వైసీపీ వంటి పార్టీలలో చేరి కొండా సురేఖ తన రాజకీయ భవిష్యత్తు ఇబ్బంది చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ లోనే ఆమె నాలుగు సార్లు గెలిచి రెండు సార్లు మంత్రి అయిన విషయం మరచారు అని అంటున్నారు. తాను ఎక్కిన కొమ్మనే నరుక్కోవడం రాజకీయం కాదని దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్నా ఆమె నేర్చుకోలేదని అంటున్నారు. లేకపోతే మంత్రి పదవి ఇలా పుటుక్కున పోయేదా అని అంటున్నారు.

తెలిసి వచ్చిందా :

తనను బర్తరఫ్ చేసిన విషయం మీద ఎంతో ఆవేశంగా మాట్లాడుతూ ఒక దశలో కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేకి రాజీనామా చేయాలని కొండా సురేఖ నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. అయితే అవి ఎందుకో సాయంత్రం అయ్యేసరికి ఆగిపోయాయి. తాను కాంగ్రెస్ లోనే కొనసాగుతాను అని ఎమ్మెల్యేగా ఉంటాను అని సురేఖ చెప్పడం ద్వారా ఈ సస్పెన్స్ కి తెర దించారు. నిజానికి ఆమె తన ఎమ్మెల్యే సీటుకు రాజీనామా చేస్తే కనుక కచ్చితంగా అక్కడ కాంగ్రెస్ గెలిచేది. ఆమె ఏ పార్టీ నుంచి చేసినా ఓటమి ఎదురయ్యేది అని అంటున్నారు. దీనికి నిలువెత్తు ఉదాహరణగా 2012లో జరిగిన పరకాల ఉప ఎన్నికలను చూపిస్తున్నారు. ఆమె కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైసీపీ తరఫున పోటీ చేస్తే ఓటమి ఎదురైంది. మొత్తం మీద కొండా సురేఖ ఎమ్మెల్యేగా అయినా ఇపుడు ఉంటారు కాబట్టి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే మళ్ళీ రాజకీయంగా బాగా ఉంటుందేమో. ఏది ఏమైనా సురేఖ అక్క ఎమ్మెల్యేగా కొనసాగి మంచి పని చేశారు అని అంటున్నారు.

# సింపతీ ఆయుధం? సానుకూలతలు,సవాళ్లు



నిజామాబాద్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ వేదికగా కన్నీళ్లు పెట్టుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించి జైలు జీవితం గడపడం, ఆ తదనంతర పరిణామాల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి తనను పక్కన పెట్టడం, కుటుంబపరంగా ఎదుర్కొన్న ఒంటరితనాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. భారత రాజకీయాల్లో కన్నీళ్లు, భావోద్వేగాలు ఎప్పుడూ అత్యంత ప్రభావవంతమైన సెంటిమెంట్ ఆయుధాలే. ప్రత్యేకించి మహిళా నాయకులు ప్రజా సమక్షంలో తమ ఆవేదనను వెళ్లగక్కినప్పుడు, ప్రజలు దానిని సొంత బిడ్డ లేదా సోదరి పడుతున్న కష్టంగా భావిస్తే అది బలమైన రాజకీయ సింపతీగా మారి ఓట్ల రూపంలో వ్యక్తమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.నిజామాబాద్ కోడలిగా మీ ముందుకు వచ్చాను, మీ బిడ్డగా అడుగుతున్నాను అని కవిత పిలుపునివ్వడం ద్వారా పక్కా లోకల్ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేశారు. 2014లో ఎంపీగా గెలిచి, 2019లో ఓటమి చవిచూసిన నిజామాబాద్ మళ్లీ తన రాజకీయ పునరాగమనానికి సరైన వేదిక అని ఆమె భావిస్తున్నారు. బిఆర్ఎస్ నుంచి వేరుపడి తెలంగాణ రక్షణ సేన పేరిట కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ తరుణంలో, తనకు జరిగిన అన్యాయాన్ని మరియు పడ్డ కష్టాలను ప్రజల ముందు ఉంచి సానుభూతి సాధించడం కవిత ముందస్తు రాజకీయ వ్యూహంలో అత్యంత కీలక భాగం. నాయకుల కన్నీళ్లు ఒక్కసారికి ప్రజల దృష్టిని ఆకర్షించగలవు. కానీ ఆ కన్నీళ్లను ఓట్లుగా మార్చాలంటే క్షేత్రస్థాయిలో సెంటిమెంట్‌కు తోడు బలమైన సంస్థాగత నిర్మాణమూ అవసరం. తెలంగాణలోని మహిళా ఓటర్లతో కవితకు బతుకమ్మ పండుగ ద్వారా మొదటి నుంచీ ప్రత్యేక అనుబంధం ఉంది. జైలు కష్టాలను, సొంత పార్టీలోనే సొంత నాయకులే పక్కన పెట్టారన్న ఆవేదనను బహిర్గతం చేయడం వల్ల ద్వితీయ శ్రేణి మహిళా కేడర్‌లో సానుభూతి వ్యక్తమయ్యే అవకాశం ఉంది. బిఆర్ఎస్ అసలైన టిఆర్ఎస్ పేరులోని తెలంగాణ గుండెచప్పుడును కోల్పోయిందని విమర్శిస్తూ, తాను తెలంగాణ రక్షణ సేన గా రావడం ద్వారా గులాబీ కేడర్‌ను తనవైపు తిప్పుకోవాలనేది ఆమె ప్లాన్. తాను అనుభవించిన శిక్ష అక్రమ కేసుల వల్ల వచ్చిందేనని నిరూపించుకునే ప్రయత్నం ఈ సభలో స్పష్టంగా కనిపించింది. కవిత సెంటిమెంట్ కార్డు ఉపయోగిస్తున్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్లు ఆమెపై చేసిన అవినీతి ఆరోపణలను ప్రజలు ఎంతవరకు మర్చిపోతారు అనేది పెద్ద ప్రశ్న. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లడంపై ప్రతిపక్షాలు వేసే విమర్శల దాడిని ఈ కన్నీళ్ల సెంటిమెంట్ దాటగలదా అనేది చూడాలి. కేవలం సానుభూతి మాత్రమే ఎన్నికలను గెలిపించలేదు. కొత్తగా పెట్టిన పార్టీకి గ్రామస్థాయిలో పోలింగ్ బూత్ కమిటీలు, బలమైన నాయకత్వం నిలబడకపోతే, ఓటర్ల సానుభూతి ఓటుగా మారకుండా కేవలం జాలి గానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో సానుభూతి అనేది ఒక ప్రారంభ పాయింట్ మాత్రమే గానీ, అది విజయాన్ని నిర్ణయించే ఆఖరి మెట్టు కాదు. గతంలో ఇందిరా గాంధీ నుంచి మొదలుకొని సోనియా గాంధీ, జగన్ మోహన్ రెడ్డి , జయమ్మ వరకు సెంటిమెంట్ వర్కవుట్ అయిన సందర్భాలు ఉన్నాయి. కానీ కవిత విషయంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం బలమైన సంక్షేమ పథకాలతో ఉండటం, మరోవైపు బీజేపీ నిజామాబాద్‌లో బలంగా పాతుకుపోవడం వల్ల పోటీ త్రిముఖంగా ఉంది. నిజామాబాద్ వేదికగా కవిత రగిల్చిన ఈ సెంటిమెంట్ మంటలు ఆమెకు రాజకీయంగా కొంత పునాదిని, ఉనికిని కల్పించవచ్చు. అయితే, ఈ సానుభూతిని కేవలం కన్నీళ్ల ప్రసంగాలకే పరిమితం చేయకుండా, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే స్ట్రాంగ్ లీడర్ గా రూపాంతరం చెందితేనే తెలంగాణ రక్షణ సేన సక్సెస్ అయ్యే అవకాశాలు ఉంటాయి.

# టెక్ కంపెనీల లే ఆఫ్ ల పర్వం..భారీగా ఉద్యోగాల కోత!



హైదరాబాద్,ప్రపంచ వ్యాప్తంగా ఏఐ కృత్రిమ మేధా సహా ఐటీ రంగాలలో వస్తున్న మార్పుల..మారుతున్న సాంకేతిక పరిణామాల మధ్య టెక్ కంపెనీల లే ఆఫ్ లు పెరిగిపోతుండటం ఉద్యోగులను కలవరపెడుతుంది. దిగ్గజ టెక్ కంపెనీలు కూడా లే ఆఫ్ లతో వేల సంఖ్యలో ఉద్యోగాలకు కోత పెడుతున్నాయి. దీంతో ఉద్యోగాలు కోల్పోతున్న వారు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల అన్వేషణలో తీవ్ర అపసోపాలు పడుతున్నారు. తాజాగా ట్రూఆప్ సంస్థ నివేదిక మేరకు 2026లో ఇప్పటికే 1,75,000 పైగా టెక్ ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారు. లే ఆఫ్ ల ద్వారా 2025లో 2,75,000 మంది ఉద్యోగాలు కోల్పోగా..ఈ సంఖ్య ఈ ఏడాది మరింత పెరుగునుండటం ఆందోళనకరంగా మారింది.

వేలల్లో తొలగింపుల పర్వం...

ఒక్క ఓరాకిల్ సంస్థ ఏడాది వ్యవధిలోనే 13శాతం మందిని...అంటే 21,000మంది ఉద్యోగులను తొలగించడం గమనార్హం. మైక్రోసాఫ్ట్ సంస్థ గత నెలలో 4,800 ఉద్యోగులకు లే ఆఫ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మరోసారి 7000నుంచి 10వేల మంది వరు ఉద్యోగులను తొలగించే సన్నాహాలు చేస్తుండటం ఆందోళనకం. ఉబర్ సంస్థ తన కస్టమర్ సర్వీస్ విభాగంలో 10శాతం అంటటే 3,400మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఆమెజాన్ కూడా ఏఐ విభాగంలో ఉద్యగాలో కోత పెట్టింది. ఎడ్స్ బాక్స్ సంస్థ 2027నాటికి 3,200మందిని క్రమంగా తొలగించే ప్రక్రియ చేపట్టింది. డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేపాల్, భారత్‌లో ఉద్యోగ కోతలను చేపట్టినట్లు సమాచారం. ఈ సంస్థ తన భారతీయ ఉద్యోగులలో నోటీసులు లేకుండానే 600 మందిని తొలగించినట్లు తెలిసింది. ఈ సంఖ్య భారత్‌లోని కంపెనీ ఉద్యోగుల్లో 10%కి సమానం. టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆపరేషన్స్, పేమెంట్స్, ఫైనాన్స్ విభాగాలలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలో పేపాల్ 600 ఉద్యోగాలను తొలగించింది. ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి కోతలతో పేపాల్ ప్రపంచవ్యాప్త పునర్వ్యవస్థీకరణను చేపడుతున్న సమయంలో ఈ చర్య చోటుచేసుకుందని సమాచారం.

టెక్నాలజీ మార్పులు..తెచ్చిన తంటాలు?

లే ఆఫ్స్ కు ప్రధాన కారణాలలో ఏఐ సాంకేతికతో పటు పలు సంస్థాగత మార్పులు కూడా కారణంగా కనిపిస్తున్నాయి. ఐటీ సేవలకు డిమాండ్ తగ్గడం, వ్యాపార పరమైన సంస్కరణలు, నిర్వాహణ వ్యయం తగ్గించుకోవడం వంటి అంశాలతో పాటు టెక్నాలజీలో మార్పులు లే ఆఫ్ లకు కారణమని తెలుస్తుంది. అయితే గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీలలో భారీ వేతనాలకు పనిచేసే ఉద్యోగులు అకస్మిక తొలగింపులకు గురవ్వడం వారిని జీవితాలను కుదిపేస్తుంది. ప్రత్యామ్నాయ ఉద్యోగాలు దొరక్క ఆర్థికపరమైన, కుటుంబపరమైన ఇబ్బందులు ఎదుర్కోంటున్నట్లుగా బాధిత ఉద్యోగులు వాపోతున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140